అణు పరీక్షలకు చైనా సిద్ధం?

లాప్ నుర్ పరీక్ష కేంద్రం రీయాక్టివ్ | శాటిలైట్ చిత్రాల ద్వారా వెల్లడి

న్యూఢిల్లీ, డిసెంబర్ 22: అణ్వాయుధాలను పరీక్షించేందుకు చైనా సిద్ధమవుతున్నదా? ఇందుకోసం జిన్‌జియాన్ రీజియన్‌లోని లాప్ నుర్ న్యూక్లియర్ పరీక్ష కేంద్రాన్ని మళ్లీ క్రియాశీలం(రీయాక్టివేషన్)చేస్తున్నదా? అంటే అవుననే సమాధానం వినిపిస్తున్నది. ఈ వాదనను బలపర్చేలా తాజాగా మాక్సర్ శాటిలైట్ చిత్రాలను విడుదల చేసింది. దీనిపై అమెరికా మీడియా సంస్థ న్యూయార్క్ టైమ్స్ మొదటగా ఓ కథనం ప్రచురించింది. దీంతో ప్రస్తుతం ఈ అంశంపై పెద్దయెత్తున చర్చ నడుస్తున్నది. అణు పరీక్ష కేంద్రాన్ని అప్‌గ్రేడ్ చేస్తున్నట్టు లాప్ నుర్ శాటిలైట్ చిత్రాల్లో కనిపిస్తున్నది. 2017 నాటికి కొన్ని భవనాలు మాత్రమే ఉండే ఆ సైట్.. ఇప్పుడు ఆధునీకరణ అయిందని, భద్రతా ఫెన్సింగ్‌లతో కూడిన అత్యాధునిక కాంప్లెక్స్‌లు వచ్చాయని న్యూయార్క్ టైమ్స్ పేర్కొన్నది. పెద్ద పేలుళ్లను నిర్వహించేందుకు అనువైన బంకర్, కొత్త ఎయిర్ బేస్ వంటివి కొత్త నిర్మాణాల్లో ఉన్నాయని తెలిపింది. ఒక 90 అడుగుల పొడవైన పెద్ద డ్రిల్లింగ్ మెషీన్ కూడా ఉన్నదని పేర్కొన్నది. ఈ చిత్రాలను చూస్తే చైనా త్వరలో పూర్తి స్థాయిలో అణు పరీక్షలు లేదా సబ్ క్రిటికల్ అణు పేలుళ్లను నిర్వహించేలా కనిపిస్తున్నదని ఎన్డీటీవీ తన తాజా కథనంలో వెల్లడించింది. చైనా చేస్తున్న ప్రయత్నాలు కొత్త తరం బాలిస్టిక్, క్రూయిజ్ క్షిపణులతో వినియోగించే కొత్త న్యూక్లియర్ వార్‌హెడ్‌లను పరీక్షించేందుకు, వాటి సామర్థ్యాన్ని పరిశీలించేందుకు ఆ దేశం ఆసక్తి కనబరుస్తున్నట్టు పేర్కొన్నది. ప్రముఖ అంతర్జాతీయ జియోస్పేషియల్ నిఘా నిపుణుడు డాక్టర్ బార్బియార్జ్ అందించిన ఆధారాలతో న్యూయార్క్ టైమ్స్ ఈ శాటిలైట్ చిత్రాలపై తన కథనంలో విశ్లేషణ చేసింది.

అణు పరీక్షల కోసం 90 అడుగుల పొడవైన పెద్ద డ్రిల్లింగ్ మెషీన్‌తో అణ్వాయుధాన్ని ఉంచే స్థలాన్ని సిద్ధం చేస్తున్న దృశ్యం

అణ్వస్త్రాలను పెంచుకుంటున్న డ్రాగన్

చైనా తన క్షిపణి వ్యవస్థ సామర్థ్యాన్ని ఇటీవలి కాలంలో మరింత విస్తరించిందని మిడిల్‌బురీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంటర్నేషనల్ స్టడీస్ అధ్యయనం గతంలో పేర్కొన్నది. దశాబ్దం క్రితం చైనా వద్ద 50 ఖండాంతర బాలిస్టిక్ క్షిపణులు ఉండగా.. 2028 నాటికి ఆ సంఖ్యను వెయ్యికి పైగా పెంచేందుకు చైనా ఆర్మీ కసరత్తు చేస్తున్నదని ఆ నివేదిక వెల్లడించింది.

క్షిపణిని విమానంలా భ్రమింపజేసే 'గోల్డెన్ వెయిల్'

తన ఆయుధాలను నిఘా వ్యవస్థల కంట పడకుండా చూసేందుకు ఓ సరికొత్త మెటీరియల్‌ను చైనా అభివృద్ధి చేసింది. క్రూయిజ్ క్షిపణులను జెట్‌లైనర్ల లాంటి పెద్ద విమానాల్లా భ్రమింపజేయడం ద్వారా అవి శత్రుదేశాల గగనతల రక్షణ వ్యవస్థలను ఛేదించేందుకు ఇది వీలుకల్పిస్తుంది. బంగారు ముసుగు (గోల్డెన్ వెయిల్)గా పిలిచే ఈ కొత్త పదార్థం చాలా చవకైనది. చైనా క్షిపణులను ప్రయాణికుల విమానాల్లా భ్రమింపజేసేందుకు దీన్ని ఉపయోగించనున్నారు. వాయువ్య చైనాలోని పరిశోధకుల బృందం అభివృద్ధి చేసిన ఈ పదార్థం స్టెల్త్ టెక్నాలజీకి పూర్తి భిన్నమైనది. గువామ్, అమెరికా ప్రధాన భూభాగాల్లోని గగనతల రక్షణ వ్యవస్థలను ఛేదించేందుకు విభిన్న పద్ధతులను రూపొందించుకునేందుకు చైనా చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగా దీన్ని తయారు చేశారు. చైనా సైనిక దళం ప్రధానంగా రక్షణాత్మక ధోరణిని అవలంబిస్తున్నప్పటికీ తైవాన్ లేదా దక్షిణ చైనా సముద్రం లాంటి ప్రాంతీయ వ్యవహారాల్లో విదేశీ జోక్యాన్ని ప్రతిఘటించేందుకు నూతన సాంకేతికతలు ఓ నిరోధకంలా చైనాకు ఉపకరిస్తాయని నిపుణులు చెప్తున్నారు.

'పక్క దారి' పట్టించేందుకే

పూంఛ్ దాడి!

- భారత ఆర్మీని లధక్ నుంచి కశ్మీర్‌కు తిరిగి వెళ్లేలా చేసేందుకు ప్రయత్నం
- ఇది పాక్-చైనా పన్నాగం
- రక్షణ వర్గాల వెల్లడి

ఉగ్రదాడిలో దెబ్బతిన్న సైనిక వాహనం(ఫైల్)

న్యూఢిల్లీ, డిసెంబర్ 22: గురువారం జమ్ము కశ్మీర్‌లోని పూంఛ్ జిల్లాలో జరిగిన ఉగ్ర దాడి పాకిస్థాన్-చైనా పన్నాగమని రక్షణ వర్గాలు వెల్లడించాయి. పూంఛ్ జిల్లాలో ఉగ్రవాద కార్యకలాపాలను తిరిగి పెంపొందించడం ద్వారా భారత సైన్యంపై ఒత్తిడి తేవాలని ఆ రెండు దేశాలు భావిస్తున్నాని.. తద్వారా సైన్యాన్ని లధక్ సరిహద్దు నుంచి కశ్మీర్‌కు తిరిగి వెళ్లేలా చేయాలనేది వారి ప్రణాళిక అని రక్షణ రంగ నిపుణులు చెప్తున్నారు. 2020లో గల్వాన్ సరిహద్దు ఘర్షణ తర్వాత భారత బలగాలను కశ్మీర్‌కు వెనక్కి పంపాలని చైనా ప్రయత్నిస్తున్నది. ఈ నేపథ్యంలో జమ్ము కశ్మీర్ ఉత్తర ప్రాంతంలో భారత్‌ను ఒత్తిడికి గురిచేసేందుకు పశ్చిమ ప్రాంతంలో ఉగ్రవాదాన్ని రాజేయాలని చైనా, పాకిస్థాన్ భావిస్తున్నాయి. 2003 నుంచి పూంఛ్-రాజౌరీ జిల్లాల్లో ఉగ్ర దాడులు ఎక్కువయ్యాయని.. ఆనాటి నుంచి ఉగ్రవాదులు ఆ ప్రాంతంలో దాగుడు మూతలు ఆడుతున్నారని రక్షణ రంగ నిపుణుడు కర్నల్ మనోజ్ కుమార్ తెలిపారు. ఈ నేపథ్యంలో ఆ ప్రాంతానికి భారత సైన్యం అదనపు బలగాలను పంపింది. తాజా ఆపరేషన్లలో 20 మంది ఉగ్రవాదులను ఏరివేసింది. 2019లో 370 అధికరణ రద్దు చేయడంతో పాక్, చైనా నిరాశ, కోపంతో ఉన్నాయని.. అందుకే అవి కశ్మీర్‌లో ముఖ్యంగా సరిహద్దు జిల్లాలైన పూంఛ్, రాజౌరీల్లో సమస్యలు సృష్టించడానికి ప్రయత్నిస్తున్నాయని విశ్రాంత కర్నల్ అజయ్ కొతియాల్ అన్నారు.

కశ్మీరీ టెర్రర్‌తో ఖలిస్థానీ దోస్తీ

కశ్మీర్ ఉగ్రవాదులతో చేతులు కలిపిన పన్నూ

పన్నూ

న్యూఢిల్లీ, డిసెంబర్ 22: కెనడా కేంద్రంగా భారత్‌పై తీవ్ర ద్వేషం వెళ్లగక్కుతున్న 'సిక్స్ ఫర్ జస్టిస్' అధినేత, ఖలిస్థానీ ఉగ్రవాది గురుపత్వంత్ పన్నూ మరింత ప్రమాదకరంగా మారాడు. తాజాగా అతడు కశ్మీర్ ఉగ్రవాదులతో చేతులు కలిపి కొత్త సంస్థను ఏర్పాటు చేశాడు. ఆ విషయాన్ని పన్నూయే స్వయంగా ప్రకటించాడు. 'కశ్మీర్-ఖలిస్థాన్ రెఫరెండం ఫ్రంట్' అధికార ప్రతినిధిగా తనను తాను ప్రకటించుకొన్నాడు. ఇక నుంచి భారత సైన్యంపై భీకర దాడులు చేస్తామని హెచ్చరించాడు. 'భారత సైన్యం దశాబ్దాలుగా మారణహోమం సృష్టిస్తున్న భారత ఆక్రమిత కశ్మీర్ అంతర్జాతీయ వివాదంగా మారిన ప్రాంతం. భారత సైన్యం దశాబ్దాలుగా చేసిన హింసకు ఇప్పుడు కశ్మీర్ స్వాతంత్ర్య సమరయోధుల చేతుల్లో మరణిస్తూ ఫలితం అనుభవిస్తున్నది. హింస ఎప్పుడూ హింసనే పుట్టిస్తుంది' అని ఓ ప్రకటన విడుదల చేశాడు. గురువారం కశ్మీర్‌లోని రాజౌరీ జిల్లాలో ఉగ్రవాదులు జరిపిన దాడిలో ఐదుగురు సైనికులు ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. ఈ ఘటనను ఉదాహరణగా చూపుతూ పన్నూ ఈ ప్రకటన విడుదల చేశాడు. 'భారత యూనియన్‌లో పంజాబ్‌ను విలీనం చేయటాన్ని ఎస్ఎఫ్‌జే ఎలా సవాల్‌చేస్తూ ప్రజాభిప్రాయ సేకరణకు డిమాండ్ చేస్తున్నదో.. కశ్మీర్ కోసం కూడా కశ్మీరీ పోరాటయోధులు డిమాండ్ చేయండి' అని పిలుపునిచ్చాడు. పన్నూను కేంద్ర హోంశాఖ 2020, జులై 1న ఉగ్రవాదిగా ప్రకటించింది. ఏడాది తర్వాత అతడి సంస్థ ఎస్ఎఫ్‌జేను నిషేధించింది.

జనవరిలో అఖిల భారత రైతాంగ సదస్సు: ఎస్కేఎం

న్యూఢిల్లీ: వచ్చే ఏడాది జనవరిలో పంజాబ్‌లో అఖిల భారత రైతాంగ సదస్సు నిర్వహించనున్నట్టు సంయుక్త కిసాన్ మోర్చా(ఎస్కేఎం) వెల్లడించింది. కనీస మద్దతు ధరకు చట్టబద్ధత, రైతు రుణాల మాఫీ, విద్యుత్తు రంగ ప్రైవేటీకరణను విరమించుకోవాలన్న తమ డిమాండ్ల సాధనకు అనుసరించాల్సిన భవిష్యత్తు కార్యాచరణపై అందులో చర్చిస్తామని శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నది. వ్యవసాయ సంక్షోభాన్ని అధిగమించేందుకు ప్రత్యామ్నాయ పాలసీలపై రైతాంగ సదస్సు చర్చిస్తుందని, రైతాంగ ఉద్యమాన్ని ఉధృతం చేయడంపై నిర్ణయాలు తీసుకొంటామని తెలిపింది. క్రిమినల్స్‌ను కాపాడుతున్న ప్రధాని ముఖంపై కొట్టేలా రెజ్లర్ సాక్షి మాలిక్ ధైర్యమైన నిర్ణయం తీసుకొన్నదని.

కేజ్రీవాల్‌కు మరోసారి ఈడీ సమన్లు

న్యూఢిల్లీ, డిసెంబర్ 22: మద్యం పాలసీ కేసులో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ తాజాగా మరోసారి సమన్లు జారీ చేసింది. వచ్చే ఏడాది జనవరి 3న తమ ముందు విచారణకు హాజరు కావాలని ఆదేశించింది. కేజ్రీవాల్‌కు ఈడీ సమన్లు జారీ చేయడం ఇది మూడోసారి. ఈసారి హాజరు కాకపోతే కేజ్రీవాల్‌పై నాన్‌బెయిలబుల్ వారెంట్‌ను జారీ చేసే అవకాశం ఉంది. గతంలో నవంబర్ 2, డిసెంబర్ 21 తేదీలలో ఈడీ ఆయనకు నోటీసులు ఇచ్చింది. కేజ్రీవాల్ విపాసన మెడిటేషన్ కోర్సుకు హాజరు కావాల్సి ఉందని, ఇది ముందే నిర్ణయించిన కార్యక్రమం కాబట్టి ఆయన ఈడీ ముందుకు రాలేరని రెండో నోటీసు సందర్భంగా పార్టీ వర్గాలు స్పష్టం చేశాయి.

రూ.39.50 తగ్గిన వాణిజ్య సిలిండర్ ధర

న్యూఢిల్లీ: వాణిజ్య అవసరాల కోసం వినియోగించే వంట గ్యాస్ (19 కిలోలు) ధర రూ.39.50 తగ్గింది. దీంతో దేశ రాజధాని ఢిల్లీలో సిలిండర్ ధర రూ.1,757కు చేరింది. ముంబైలో రూ.1,710, కోల్‌కతాలో రూ.1,868.50, చెన్నైలో రూ.1,929కి సిలిండర్ దొరుతున్నది. అంతర్జాతీయంగా గ్యాస్ ధరల్లో హెచ్చుతగ్గుల నేపథ్యంలోనే తాజాగా ధరలు తగ్గినట్టు గ్యాస్ కంపెనీలు తెలిపాయి. ఇండ్లలో వినియోగించే 14.2 కిలోల సిలిండర్ ధరలో మార్పు లేదని వెల్లడించాయి.

గణతంత్ర వేడుకలకు ముఖ్య అతిథిగా ఫ్రాన్స్ అధ్యక్షుడు

న్యూఢిల్లీ: వచ్చే ఏడాది గణతంత్ర వేడుకలకు ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ ముఖ్య అతిథిగా హాజరవుతున్నారు. ఆయన రిపబ్లిక్ వేడుకలకు హాజరయ్యే ఆరో ఫ్రెంచి నేత. తొలుత రిపబ్లిక్ డే వేడుకలకు అమెరికా అధ్యక్షుడు జో బైడెన్‌ను భారత్ ముఖ్య అతిథిగా ఆహ్వానించింది. అయితే త్వరలో జరిగే అధ్యక్ష ఎన్నికలు, ఇజ్రాయెల్-హమాస్ సంక్షోభం తదితర కారణాలతో ఆయన రాలేకపోతున్నట్టు వైట్‌హౌస్ వర్గాలు తెలియజేయడంతో ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్‌ను ఆహ్వానించారు. రక్షణ, వాణిజ్యం, నూతన టెక్నాలజీ, క్లీన్ ఎనర్జీ తదితర రంగాలలో ఇప్పటికే భారత్-ఫ్రాన్స్ మధ్య పటిష్ఠ సంబంధాలు ఉన్నాయి.

ఇండో అమెరికన్ల ఇండ్లలో పెరుగుతున్న దోపిడీలు

వాషింగ్టన్: అమెరికాలోని వాషింగ్టన్ స్టేట్, స్నోహోమిష్ కౌంటీలో దొంగతనాలు పెరుగుతున్నాయి. రెండు వారాల నుంచి దొంగలు ముఖ్యంగా భారతీయ అమెరికన్ల ఇళ్లనే లక్ష్యంగా చేసుకుంటున్నారు. ఈ దొంగలను పట్టుకోవడానికి సహకరించాలని పోలీసులు ప్రజలను కోరారు. పట్టపగలే వీరు దొంగతనాలకు పాల్పడుతుండటాన్ని బట్టి వీరంతా ఓ పెద్ద వ్యవస్థీకృత ముఠాకు చెందినవారై ఉండవచ్చునని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ అనుమానితుల ఫొటోలు, వీడియోలు ఉంటే తమకు పంపించాలని ప్రజలను కోరారు. ఈ కౌంటీలోకి కొత్తగా వచ్చిన దంపతులు మాట్లాడుతూ, ఇక్కడ భద్రత ఉంటుందని భావించామని, ప్రస్తుత పరిస్థితులు ఆందోళనకరంగా ఉన్నాయని చెప్పారు. నిఘా కెమెరాల కోసం వేలాది డాలర్లు ఖర్చుపెట్టామని చెప్పారు. ఇండియన్ అమెరికన్లలో చాలా మంది అమెరికన్ పౌరులు కానందు వల్ల తుపాకీని తమ వద్ద ఉంచుకునే అవకాశం లేదన్నారు. ఇదే దొంగలకు సానుకూలంగా కనిపించి ఉండవచ్చునని తెలిపారు.

ఏడు నెలల గరిష్ఠానికి కరోనా కేసులు

న్యూఢిల్లీ, డిసెంబర్ 22: దేశంలో కరోనా కేసులు క్రమంగా పెరుగుతున్నాయి. గురువారం నుంచి శుక్రవారం నాటికి 24 గంటల వ్యవధిలో 328 కొత్త కేసులు వెలుగుచూశాయి. దీంతో యాక్టివ్ కేసుల సంఖ్య 2,997కు చేరింది. గత ఏడు నెలల్లో కేసుల సంఖ్య ఇంత చేరడం ఇదే తొలిసారి. అందరినీ కలవరపెడుతున్న కరోనా సబ్ వేరియంట్ జేఎన్.1 కేసులు ఇప్పటివరకు 22 నమోదయ్యాయని, ఇందులో 21 కేసులు గోవాలో, ఒకటి కేరళలో నమోదైందని కేంద్ర ఆరోగ్య శాఖ అధికారులు చెప్పారు. వీరంతా కోలుకున్నారని వెల్లడించారు. వైరస్ గురించి పెద్దగా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, కాకపోతే అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా కొత్త సంవత్సరం వేడుకలు, పండుగలప్పుడు జాగ్రత్త వహించాలని కోరారు. కేరళలో జేఎన్.1 కేసులు పెరిగే అవకాశముందని ఆ రాష్ట్ర వైద్య మంత్రి తెలిపారు. ఈ వేరియంట్ వేగంగా వ్యాప్తి చెందే అవకాశాలున్నాయని చెప్పారు.

విమానానికి బాంబు పెట్టి లేపేశారు?

పుతిన్ ఆదేశాలతోనే ప్రిగోజిన్ హత్య!.. వాల్‌స్ట్రీట్ జర్నల్ కథనం

ప్రిగోజిన్

వాషింగ్టన్, డిసెంబర్ 22: రష్యా కిరాయి సైన్యం వాగ్నర్ గ్రూపు చీఫ్ యెవ్‌జెనీ ప్రిగోజిన్ విమాన ప్రమాదంలో మరణించాడని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ గతంలో చెప్పారు. అయితే ప్రిగోజిన్ చనిపోయింది ప్రమాదంలో కాదని.. ఆయన ప్రయాణిస్తున్న విమానానికి బాంబు పెట్టి హత్య చేశారని, ఇదంతా పుతిన్ ఆదేశాలతోనే జరిగిందని తాజాగా వాల్‌స్ట్రీట్ జర్నల్ సంచలన కథనం వెలువరించింది. ప్రిగోజిన్ మృతి చుట్టూ ఇప్పటికే అనుమానాలు ఉన్నాయి. పుతినే ప్రిగోజిన్‌ను చంపించాడనే ఆరోపణలు కూడా ఉన్నాయి. దీనిపై వాల్‌స్ట్రీట్ జర్నల్ ఓ రష్యా మాజీ నిఘా అధికారిని ఉటంకిస్తూ ఇచ్చిన కథనంలో పుతిన్‌కి రైట్ హ్యాండ్‌గా భావించే, దేశ భద్రతా కౌన్సిల్ కార్యదర్శి నికోలయ్ పత్రుషేవ్ పుతిన్ అనుమతితో ప్రిగోజిన్‌ను హత్య చేయించారని, ఆ ప్రతిపాదనకు పుతిన్ అనుమతి ఇచ్చారని పేర్కొన్నది. ఉక్రెయిన్‌తో యుద్ధంలో రష్యా సైన్యంలో వాగ్నర్ గ్రూపు కీలక పాత్ర పోషించిన విషయం తెలిసిందే. తర్వాత వాగ్నర్ చీఫ్ ప్రిగోజిన్, రష్యా రక్షణ మంత్రికి విబేధాలు తలెత్తాయి. ఫలితంగా వాగ్నర్ గ్రూపు ఈ ఏడాది జూన్‌లో రష్యాలో తిరుగుబాటుకు చేసిన యత్నం క్రెమ్లిన్‌ను కుదిపేసిన విషయం తెలిసిందే. బెలారస్ అధ్యక్షుడి మధ్యవర్తిత్వంతో వాగ్నర్ గ్రూపు రాజధాని మాస్కోకు చేపట్టిన 'మార్చ్' మధ్యలోనే నిలిచిపోయింది. అయితే ప్రిగోజిన్‌తో ఎప్పటికైనా ముప్పేనని నికోలయ్ పత్రుషేవ్ చాలా కాలంగా భావిస్తూ వస్తున్నారు. రక్షణ మంత్రిపై బహిరంగ ఆరోపణలు, తిరుగుబాటు, అనుకొన్న దాని కంటే వాగ్నర్ గ్రూపు శక్తివంతం అయిన నేపథ్యంలో ప్రిగోజిన్‌ను హతమార్చాలని రష్యాలో పుతిన్ తర్వాత రెండో అత్యంత శక్తివంతమైన వ్యక్తిగా భావించే నికోలయ్ అనుకొన్నారని, దీనికి పుతిన్ కూడా అభ్యంతరం చెప్పలేదని వాల్‌స్ట్రీట్ జర్నల్ తన కథనంలో పేర్కొన్నది.

విమానం రెక్క కింద బాంబు

విమాన పేలుడు ప్రమాదంలో ప్రిగోజిన్ మరణించాడని పుతిన్ మృతి సమయంలో పేర్కొన్నారు. ప్రిగోజిన్ పలు తప్పులు చేశాడని పేర్కొంటూనే పుతిన్.. విమానంలో తీసుకెళ్తున్న గ్రనేడ్ల కారణంగానే పేలుడు సంభవించిందని ప్రచారం చేశారు. అయితే పుతిన్ వ్యాఖ్యలను ఖండించిన వాల్‌స్ట్రీట్ జర్నల్.. మాస్కో ఎయిర్‌పోర్టులో ప్రిగోజిన్ విమానం వేచివున్న సమయంలో విమానం రెక్కకు ఒక చిన్న బాంబును అతికించారని, దాని వలన పేలుడు జరిగిందని పేర్కొన్నది. కాగా, వాల్‌స్ట్రీట్ జర్నల్ కథనం ఒక కల్పన అని క్రెమిన్ ఖండించింది.

సిద్ధరామయ్య విలాసాలు!

- అల్ట్రా లగ్జరీ జెట్‌లో కర్ణాటక కాంగ్రెస్ ముఖ్యమంత్రి ప్రయాణం
- కరువు సహాయ నిధుల కోసం జెట్‌లో!
- కరువుతో అల్లాడుతున్న అన్నదాతలు
- విలాసాల్లో ఆ రాష్ట్ర మంత్రులు
- అధికార కాంగ్రెస్‌పై ప్రజల ఆగ్రహం



అల్ట్రా లగ్జరీ విమానంలో ప్రయాణిస్తున్న కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య

బెంగళూరు, డిసెంబర్ 22: అసలే కరువు.. అన్నదాతలు అల్లాడిపోతున్నారు.. ఎన్నికల్లో ఇచ్చిన గ్యారెంటీల అమలుకు తీవ్ర నిధుల కటకట.. ఇతర పథకాల నిధుల మళ్లింపు.. వేతనాల ఖర్చు మిగులుతుందని ఉద్యోగ నియామకాలు చేపట్టకుండా అరకొర సిబ్బందితోనే నెట్టుకొస్తున్న పరిస్థితి.. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇంతలా దిగజారిపోతుంటే కర్ణాటక కాంగ్రెస్ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య మాత్రం విలాసాల్లో మునిగి తేలుతున్నారు. లగ్జరీ ప్రైవేట్ జెట్లలో ప్రయాణం చేస్తూ, రాష్ట్ర ఆర్థిక శాఖపై పెనుభారం మోపుతున్నారు. ఆయనొక్కరే కాదు.. ఆ రాష్ట్ర మంత్రులు కూడా ఆయనతో పాటు లగ్జరీ జెట్‌లో ప్రయాణం చేస్తున్నారు. పోనీ.. ఎందుకు ప్రయాణిస్తున్నారో తెలుసా? కేంద్రం నుంచి కరువు సహాయ నిధులు అడిగేందుకు! దీనికి సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నది. కర్ణాటకలో కరువు దెబ్బకు రైతులు కుదేలవుతున్నారు. వానలు లేక, పంట నష్టం వాటిల్లి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎన్న డూలేనంత దుర్భర పరిస్థితులు అనుభవిస్తున్నారు. అయినా, అక్కడి కాంగ్రెస్ ప్రభుత్వం ఇదేమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నది. తాజాగా, లగ్జరీ ప్రైవేట్ జెట్‌లో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి, మంత్రులు ప్రయాణించటమే అందుకు నిదర్శనం. సిద్ధరామయ్య సర్కారు తీరుపై అన్ని వర్గాల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రైతులు అల్లాడిపోతుంటే, విలాసాలు కావాల్సి వచ్చిందా? అని ప్రజలు, నెటిజన్లు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సోషల్ మీడియా వేదికగా కాంగ్రెస్ సర్కారును చెడుగుడు ఆడుతున్నారు. అటు.. ప్రతిపక్ష బీజేపీ కూడా సిద్ధరామయ్య సర్కారుపై ధ్వజమెత్తింది. రైతులు కరువుతో ఇబ్బందులు పడుతుంటే, అధికార కాంగ్రెస్ నేతలు లగ్జరీ విమానాల్లో ప్రయాణం చేస్తున్నారని మండిపడింది.

తప్పేంటన్న రీతిలో సిద్ధరామయ్య జవాబు

బీజేపీ విమర్శలకు సిద్ధరామయ్య కౌంటర్ ఇచ్చే క్రమంలో తాను విలాసాలు అనుభవిస్తే తప్పేంటన్న రీతిలో వ్యాఖ్యలు చేయటం గమనార్హం. కర్ణాటక బీజేపీ అధ్యక్షుడు బీవై విజయేంద్ర.. సిద్ధరామయ్య లగ్జరీ విమాన వీడియోను పోస్ట్ చేయగా, మరి.. ప్రధాని నరేంద్ర మోదీ ఎలాంటి విమానంలో ప్రయాణిస్తున్నారో ముందు చెప్పాలని తిరిగి ప్రశ్నించారు. అయితే, లగ్జరీ ప్రైవేట్ జెట్‌లో ప్రయాణించటంపైనే విమర్శలు వెల్లువెత్తుతుండగా, తాను చేసింది తప్పేంటన్న రీతిలో జవాబివ్వటంపై నెటిజన్లు ధ్వజమెత్తారు. రాష్ట్రంలో కరువు ఉంటే, ఇలాంటి విలాసాలు అవసరమా? అని నిలదీస్తున్నారు.

కర్ణాటకలో హిజాబ్‌పై నిషేధం ఎత్తివేత

బెంగళూరు, డిసెంబర్ 22: కర్ణాటకలోని పాఠశాలలు, కళాశాలల్లో హిజాబ్ ధారణపై ఉన్న నిషేధాన్ని శనివారం నుంచి ఉపసంహరించనున్నట్టు ఆ రాష్ట్ర సీఎం సిద్ధరామయ్య శుక్రవారం ప్రకటించారు. ఈ మేరకు గతంలో ఇచ్చిన ఆదేశాలను ఉపసంహరించాలని అధికారులను ఆదేశించినట్టు ఆయన తెలిపారు. 'వస్త్రధారణ ఎంపిక ఒకరి సొంత హక్కు. అందరితో కలిసి అందరి వికాసం అన్న ప్రధాని మోదీ మాటలు బూటకం. బట్టలు, కులం ఆధారంగా బీజేపీ సమాజాన్ని, ప్రజలను విభజిస్తున్నది' అని సిద్ధరామయ్య అన్నారు. అయితే ఈ నిర్ణయం రాష్ట్రంలో రాజకీయ వివాదాన్ని రేకెత్తించే సూచనలు కనిపిస్తున్నాయి. హిజాబ్ వివాదంపై తీర్పు ప్రస్తుతం సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉంది.

వచ్చే నెల 6న గమ్యస్థానానికి ఆదిత్య ఎల్ 1: ఇస్రో

అహ్మదాబాద్: భారత తొలి సోలార్ మిషన్ 'ఆదిత్య ఎల్1' వచ్చే నెల 6న గమ్యస్థానానికి చేరుకుంటుందని ఇస్రో చైర్మన్ ఎస్ సోమనాథ్ శుక్రవారం తెలిపారు. కచ్చితంగా ఏ సమయంలో ఆ స్థానంలోకి ప్రవేశిస్తుందో తగిన సమయంలో వెల్లడిస్తామని చెప్పారు. శుక్రవారం విజ్ఞాన భారతి సంస్థ నిర్వహించిన భారతీయ విజ్ఞాన సమ్మేళన్‌లో ఆయన ఈ విషయం వెల్లడించారు. ఆదిత్య ఎల్1ను సెప్టెంబర్ 2న శ్రీహరికోట నుంచి ప్రయోగించారు.

---

303 మంది భారతీయుల అక్రమ రవాణా!

- దుబాయ్ నుంచి నికరాగ్వాకు విమానం
- మధ్యలో నిర్బంధించిన ఫ్రాన్స్ అధికారులు

పారిస్, డిసెంబర్ 22: దుబాయ్ నుంచి 303 మంది భారతీయ ప్రయాణికులతో మధ్య అమెరికాలోని నికరాగ్వాకు వెళ్తున్న ఓ విమానాన్ని 'మానవ అక్రమ రవాణా' అనుమానంతో ఫ్రాన్స్‌లో అధికారులు తమ అధీనంలోకి తీసుకొన్నారు. ఈ మేరకు గుర్తుతెలియని వ్యక్తుల నుంచి అందిన సమాచారంతో... ఇంధన రీఫిల్లింగ్ కోసం వత్రీ ఎయిర్‌పోర్టులో దిగిన విమానాన్ని అధికారులు నిర్బంధించారని పారిస్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కార్యాలయం శుక్రవారం పేర్కొన్నది. ప్రయాణికులంతా హ్యూమన్ ట్రాఫికింగ్ బాధితులు కావొచ్చని అభిప్రాయపడింది. దీనిపై దేశ వ్యవస్థీకృత నేరాల వ్యతిరేక యూనిట్ 'జునాల్కో' దర్యాప్తు చేపట్టిందని తెలిపింది. అసలు ఈ విమానం ఎక్కడకు, ఎందుకు వెళ్తుంది? అనే కారణాలను తేల్చేందుకు విచారణ ప్రారంభం అయిందని ఈస్టర్న్ మార్నే రీజియన్ స్థానిక అధికారులు వెల్లడించారు. రొమానియన్ కంపెనీ లెజెండ్ ఎయిర్‌లైన్స్ నిర్వహిస్తున్న ఈ ఏ340 విమానం ఇంధన రీఫిల్లింగ్ కోసం దిగిందని పేర్కొన్నది. అమెరికా లేదా కెనడాలోకి అక్రమంగా ప్రవేశించే ప్లాన్‌లో భాగంగా భారతీయ ప్రయాణికులు ముందు మధ్య అమెరికా వెళ్తున్నారని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. కాగా, వత్రీ ఎయిర్‌పోర్టును ప్రయాణికుల కోసం వెయిటింగ్ ఏరియాగా మార్చి పడుకొనేందుకు బెడ్లు సదుపాయం కూడా కల్పించినట్టు మార్నే పర్‌ఫెక్ట్ కార్యాలయం ఓ ప్రకటనలో పేర్కొన్నది.

మరో మహిళా జడ్జికి వేధింపులు!

జైపూర్, డిసెంబర్ 22: తనపై సర్వీసు సమయంలో పలు సందర్భాల్లో పలువురు న్యాయమూర్తులు, లాయర్లు వేధింపులకు పాల్పడ్డారని, వారిపై ఫిర్యాదులు చేసిన ఫలితంగా తాను ఉద్యోగం కూడా కోల్పోవాల్సి వచ్చిందని రాజస్థాన్‌కు చెందిన ఎలిజా గుప్తా అనే ఓ మహిళా జడ్జి ఆరోపించారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని, తనకు న్యాయం చేయాలని కోరుతూ ఆమె ఈ నెల 15న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని మోదీ, కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ మేఘ్వాల్‌కు లేఖ రాశారు. సీజేఐకి లేఖ రాసిన యూపీ జడ్జిని స్ఫూర్తిగా తీసుకుని తాను కూడా లేఖ రాసినట్టు ఎలిజా గుప్తా పేర్కొన్నారు. అయితే ఎలిజా గుప్తా ఆరోపణలను నాగౌర్‌కు చెందిన పలువురు లాయర్లు ఖండించారు. ఎలిజా గుప్తా అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని అన్నారు.

చర్చలకు చెల్లు!

పార్లమెంట్‌లో బిల్లులపై తూతూమంత్రంగా చర్చ

న్యూఢిల్లీ, డిసెంబర్ 22: పార్లమెంటులో బిల్లులపై అర్థవంతమైన చర్చలు తీరని కలగానే కనిపిస్తున్నది. 17వ లోక్‌సభలో ఇప్పటివరకు ఆమోదం పొందిన మొత్తం బిల్లులలో సగానికిపైగా బిల్లులపై రెండు గంటల కన్నా తక్కువ వ్యవధిలోనే తూతూ మంత్రంగా చర్చ జరిగిందని, పైగా 16 శాతం బిల్లులు మాత్రమే పార్లమెంట్ స్టాండింగ్ కమిటీకి పంపారని స్వతంత్ర పరిశోధన సంస్థ పీఆర్ఎస్ లెజిస్లేటివ్ రిసెర్చ్ వెల్లడించింది. పార్లమెంట్ శీతాకాల సమావేశాలు గురువారంతో ముగియడంతో ఆ సంస్థ శుక్రవారం వివరాలు తెలియజేసింది. దీని ప్రకారం.. 17వ లోక్‌సభలో ఇప్పటివరకు 172 బిల్లులు ఆమోదం పొందాయి. వాటిలో 86 బిల్లులపై లోక్‌సభలో, 103 బిల్లులపై రాజ్యసభలో రెండు గంటల కన్నా తక్కువ సమయమే సభ్యులు చర్చ జరిపారు. అలాగే మొత్తం బిల్లుల్లో లోక్‌సభలో 16, రాజ్యసభలో 11 బిల్లులపై జరిగిన చర్చల్లో మాత్రమే 30 మంది కంటే ఎక్కువ మంది సభ్యులు పాల్గొన్నారు.

డిప్యూటీ స్పీకర్‌ను ఎన్నుకోని ఏకైక సభ

డిప్యూటీ స్పీకర్‌ను ఎన్నుకోని ఏకైక సభగా 17వ లోక్‌సభ నిలిచింది. రాజ్యాంగం ప్రకారం డిప్యూటీ స్పీకర్ ఎన్నిక తప్పనిసరి. ఎన్నికలు అయిన వెంటనే సాధ్యమైనంత త్వరగా డిప్యూటీ స్పీకర్‌ను ఎన్నుకోవాల్సి ఉంటుంది. అయితే ఈ సభలో దాని గురించి అధికార పార్టీ పట్టించుకోలేదు.

సస్పెన్షన్లలోనూ రికార్డే

ఈ ఏడాది శీతాకాల సమావేశాల్లో అసాధారణ రీతిలో లోక్‌సభ నుంచి 100 మంది, రాజ్యసభ నుంచి 46 మంది ఎంపీలు సస్పెండ్ అయ్యారు. ఇది ప్రతి సభలో మొత్తం సభ్యుల సంఖ్యలో 19 శాతంతో సమానం. అంతేకాకుండా ఇంతవరకు ఏ లోక్‌సభలోనూ ఇంత పెద్దమొత్తంలో సభ్యులను సస్పెండ్ చేయలేదు.

గాజాలో మరణ మృదంగం

రఫా(గాజా స్ట్రిప్): మూడు నెలలుగా ఇజ్రాయెల్-హమాస్ మధ్య జరుగుతున్న యుద్ధంలో మరణ మృదంగం కొనసాగుతున్నది. ఇజ్రాయెల్ దాడుల కారణంగా గాజాలో ప్రాణాలు కోల్పోయిన వారి సంఖ్య 20 వేలు దాటిందని గాజా ఆరోగ్య శాఖ ప్రకటించింది. ఐక్యరాజ్యసమితి గురువారం విడుదల చేసిన నివేదిక ప్రకారం గాజాలో 5 లక్షలకుపైగా ప్రజలు ఆకలితో బాధ పడుతున్నారు. ఈ నేపథ్యంలో వెంటనే కాల్పుల విరమణ అమలు చేయాలని ఐరాస భద్రతా మండలి ఇజ్రాయెల్‌కు సూచించింది. అయితే అంతర్జాతీయ ఒత్తిడిని లెక్క చేయని ఇజ్రాయెల్, హమాస్‌ను అంతమొందించే వరకు యుద్ధాన్ని ఆపేది లేదని తేల్చి చెప్పింది. ఇప్పటివరకు 53,320 మంది పాలస్తీనియన్లు గాయపడ్డారు.

మరణాన్ని అంచనావేసే ఏఐ టూల్!

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్ (నమస్తే తెలంగాణ): ఐటీ నిపుణులు లైఫ్‌టువెక్ (Life2vec) అనే అద్భుతమైన ఏఐ అప్లికేషన్ ఆవిష్కరించారు! ఇదో డెత్ ప్రిడెక్టర్. అంటే వ్యక్తి మరణం గురించి జోస్యం చెబుతుంది. ఆ వ్యక్తి చరిత్ర, జీవన విధానం, ఆరోగ్య సమస్యలు, జీవితంలో జరిగిన సంఘటనలను పరిశీలించి, వాటి ఆధారంగా అతను ఎప్పుడు మరణిస్తాడో కచ్చితంగా చెబుతున్నదట. యూనివర్సిటీ ఆఫ్ డెన్మార్క్ పరిశోధకులు ఈ ఏఐ ఆధారిత డెత్ ప్రిడెక్టర్‌ను అభివృద్ధి చేశారు. ఇది వ్యక్తుల జీవిత కాలాన్ని అంచనా వేయడంలో 78 శాతం కచ్చితత్వంగా పనిచేస్తుంది.